
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 29.0 । కనిష్ఠం: 19.0
ANDHRAJYOTHY
5



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
బుధవారం 27 నవంబరు 2024

బియ్యం లారీ బోల్తా..

కోడేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బియ్యం లారీ బోల్తాపడి రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ గోకారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం సింగోటం నుంచి మంగళవారం రేవల్లి మండలం కొంకలపల్లికి 155 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ ఎత్తం సమీపంలో మాల వాగు దగ్గర బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా డామేజ్ అయిందని స్థానికులు తెలి పారు. ఎవరికి ప్రాణహాని జరగలేదని తెలిపారు. ఈ ప్రమాదంలో ఆరు లక్షల నష్టం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

సందిగ్ధంలో ఆర్‌డీఎస్ రైతన్న

- యాసంగికి సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వని అధికారులు



ఆర్‌డీఎస్ 16-డీ వద్ద ప్రవహిస్తున్న సాగునీరు

6

ఆటో వాలా.. కబడ్డీ కోచ్

- ఆటపై మక్కువతో శిక్షకుడిగా మారిన జిలానీ
- ఆసక్తిగల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ
- టోర్నమెంట్లకు తీసుకెళ్లేందుకు సొంత ఖర్చు




లారీ టైర్‌తో శిక్షణ ఇస్తున్న జిలానీ

7

వనపర్తిలో విషాదం

- ఇద్దరు పిల్లలతో సహా తాళ్ల చెరువులో దూకి తల్లి ఆత్మహత్య
- మృతికి కుటుంబ కలహాలే కారణం

6



ఇద్దరు చిన్నారులతో నఫీజ్ బేగం(ఫైల్)

చెల్లా చెప్పినట్లే...

- ఏదైన నిర్ణయం ఆయన్ను అడిగి తీసుకోవాల్సిందే..
- ఏడాది నుంచి అలంపూర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఖాళీ
- మరో అధికార కేంద్రం అవుతుందని ఎమ్మెల్యేను రానివ్వని పరిస్థితి
- ఏ పని కావాలన్నా కర్నూలు వెళ్లాల్సిందే..
- కేసులు, పంచాయితీలు, ఆదేశాలు ఆయన కనుసన్నల్లోనే..
- సమీక్షలు, సమావేశాలు కూడా కర్నూలు కాంపౌండ్‌లోనే..

ఆయనో నియోజకవర్గ ఎమ్మెల్యే. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలి. కానీ.. ఆ నియోజకవర్గ ప్రజలు మాత్రం తమ కష్టాలను చెప్పుకోవాలంటే నియోజకవర్గం దాటి పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు వెళ్తున్నారు. సకల సౌకర్యాలతో క్యాంపు కార్యాలయం ఉన్నా, గేటుకు తాళం వేయడంతో వృథాగా మారింది. కర్నూలు వరకు వెళ్లి తమ గోడు వినిపించుకుంటే 'అన్నతో చెబుతా' అని మాత్రమే సమాధానం వస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కథ ఇది. ఏడాదిగా ఇక్కడి ప్రజలు అనుభవిస్తున్న వ్యథ ఇది.



నిరుపయోగంగా ఉన్న అలంపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

ఎమ్మెల్సీ ఇంటి వద్ద చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

మహబూబ్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించేందుకు గత ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల పేరిట రూ.కోట్లు ఖర్చు చేసి, భవనాలు నిర్మించగా.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో మాత్రం నిరుపయోగంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో ఈ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. సంవత్సరం క్రితం ఎన్నికైన ఎమ్మెల్యేలు అక్కడి నుంచే పాలనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కొందరు రెండు మూడు చోట్ల కూడా పార్టీ, ప్రభుత్వం అంటూ వేర్వేరుగా క్యాంపు కార్యాలయాలను నడుపుతున్నారు. కానీ సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాత్రం ఆ క్యాంపు కార్యాలయాన్ని సంవత్సరం నుంచి వాడటం లేదు. అక్కడ ఉండటమూ లేదు. గెలిచిన రోజు నుంచి ఈ రోజు వరకు స్వతంత్ర, గణతంత్ర, రాష్ట్ర అవతరణ దినోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు..

(మిగతా 6లో..)

ప్రజలకు అందుబాటులో ఉండాలి



అలంపూర్ నియోజకవర్గంలో చాలామంది నిరుపేదలు ఉన్నారు. చాలామంది వివిధ సమస్యలతో సతమతమవుతూ ఉంటారు. కాబట్టి మా ఎమ్మెల్యే అలంపూర్ చౌరస్తాలో అందుబాటులో ఉండాలి. ఇక్కడ మంచిగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉంది. వసతికి ఎలాంటి ఇబ్బంది లేదు. ఎంతమంది వచ్చినా కలిసేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. చాలామంది తమ సమస్యలు చెప్పుకునేదుంకు వచ్చి కర్నూలు వెళ్లలేక తిరిగి వెళ్తున్నారు.

- మద్దిలేటి, బోరవెల్లి



కొండపల్లి వద్ద అక్విడెక్ట్ పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లు (ఫైల్)

లైన్ క్లియర్

- 99వ ప్యాకేజీ పనులకు నిధులు మంజూరు
- విద్యుత్ వైర్లను తొలగించిన అధికారులు
- రెండేళ్లుగా నిలిచిన అక్విడెక్ట్ నిర్మాణ పనులు

గద్వాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో 99వ, 100వ ప్యాకేజీ కాలువ పనుల నిర్మాణానికి ఎట్టకేలకు లైన్ క్లియర్ అయ్యింది. గద్వాల మండలం కొండపల్లి దగ్గర నిర్మిస్తున్న అక్విడెక్ట్ పనులకు హైటెన్షన్ వైర్లు అడ్డురావడంతో పనులు నిలిచిపోయాయి. వీటిని తొలగించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో విద్యుత్ లైన్ తొలగింపు పనులు పూర్తయ్యాయి. దీంతో రెండేళ్లుగా నిలిచిపోయిన అక్విడెక్ట్ పనులకు లైన్ క్లియర్ అయ్యింది.

ఎన్నికల నినాదంగా 99, 100వ ప్యాకేజీ పనులు

2014 ఎన్నికల సమయం నుంచి ప్రతీ ఎన్నికల్లో 99వ, 100వ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తాం. సాగునీరు అందిస్తామని ప్రధాన పార్టీల నాయకులు చెబుతూ వచ్చారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలోని రైతుల సమస్య కావడంతో ఎన్నికల సమయంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. కానీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లుగానే విద్యుత్ లైన్‌ల తొలగింపునకు నిధులు విడుదల చేశారు. దీంతో నిర్మాణ పనులకు ఆటంకం తొలగింది.



కొండపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అక్విడెక్ట్ పనులు

అక్విడెక్ట్ నిర్మాణం పూర్తయితేనే సాగునీరు

నెట్టెంపాడు ప్రాజెక్టు లిఫ్ట్-1 కింద గూడెందొడ్డి రిజర్వాయర్ నిర్మించారు. దీని సామర్థ్యం 1.19 టీఎంసీలు కాగా.. ఆయకట్టుకు సాగునీరు అందించడానికి కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. ఎడమ కాలువ కింద ఆరువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కానీ 63వేల ఎకరాలకు సాగునీరు అందించే కుడి కాలువ పరిస్థితే నత్తకు నడకనేర్పే విధంగా ఉంది. కుడి కాలువ పనులను 99వ ప్యాకేజీ, 100 ప్యాకేజీలుగా విభజించారు. ధరూర్, గద్వాల, ఇటిక్యాల మండలాల పరిధిలో 76 కిలోమీటర్ల పొడవునా కాలువ నిర్మాణం జరగాలి. ఇటిక్యాల మండలంలో 100వ ప్యాకేజీ పనులు ఒక కిలోమీటరు తప్ప 40 కిలోమీటర్ల పొడవున దాదాపు పూర్తయ్యాయి. 99వ ప్యాకేజీ పనులు ధరూర్, గద్వాల మండలంలో 0-36 కిలోమీటర్ల పరిధి వరకు ఉన్నాయి. ప్రస్తుతం కొండపల్లి దగ్గర అక్విడెక్ట్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులే నత్తనడకన సాగుతున్నాయి. విద్యుత్ లైన్ సమస్య క్లియర్ కావడంతో అక్విడెక్ట్ పనులు చేసేందుకు అధికారులు కార్యాచరణ మొదలు పెట్టారు. ఈ ఏడాది వానాకాలం పంట లకు సాగునీరు అందించే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి కోసం ఎదురుచూపులు



99వ, 100వ ప్యాకేజీ పనులు పూర్తయితే సాగునీరు వస్తుందని ఏళ్ల నుంచి ఎదురు చూసున్నాం. ప్రతీ ఏడాది వానాకాలం పంటలకు ఇస్తామంటూ ప్రకటన చేస్తున్నారు. కానీ ఇవ్వడం లేదు. వచ్చే వానాకాలం నాటికైనా సాగునీరు ఇవ్వాలి.

- విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు, ఇటిక్యాల

పనులు పూర్తి చేశాం



ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు కొండపల్లి దగ్గర అక్విడక్ట్ నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాము. కాలువ పరిధిలో ఎక్కడెక్కడ విద్యుత్ వైర్ల సమస్య ఉన్నా పరిష్కరిసున్నాం.

- శ్రీనివాసులు, ఏఈ, విద్యుత్‌శాఖ, జోగులాంబ గద్వాల

అక్విడెక్ట్ పనులు పూర్తి చేస్తాం



విద్యుత్ లైన్ తొలగింపు కోసం రూ.11లక్షలు డిపాజిట్ చేశాం. వాళ్లు పనులు చేస్తున్నారు. అవి పూర్తికాగానే అక్విడెక్ట్ పనులను ప్రారంభిస్తాం. 100వ ప్యాకేజీ కాలువ కిలోమీటరు తప్పితే అంతా పూర్తయింది. వానాకాలం నాటికి సాగునీరందిస్తాం.

- రహీముద్దీన్, ఇన్‌చార్జి ఎస్ఈ, గద్వాల

మెరుగైన ఫలితాలు సాధిస్తాం

- ఇంటర్ విద్య, జిల్లా నోడల్ అధికారి జీ వెంకటరమణ



నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం. ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోనూ జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల పర్యవేక్షణ, మెరుగైన ఫలితాల కోసం చేపట్టిన ప్రణాళికపై ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి జీ వెంకటరమణ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జిల్లాలో ఇంటర్ కళాశాలలు ఎన్ని ఉన్నాయి..?

జిల్లాలో 75 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. అందులో 16 ప్రభుత్వ, 19 ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి. 40 సెక్టార్ (కేజీబీవీ, గురుకుల) కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో 2,157 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రయివేటు కళాశాలల్లో 2,279 మంది ఉన్నారు. ప్ర భుత్వ కళాశాలల్లో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, హెచ్ఈసీ రెగ్యులర్ కోర్సులతో పాటు 12 రకాల ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రభుత్వ కళాశాలల్లో ఉర్దూ మీడియం కోర్సులు నిర్వహిస్తున్నాం.

అధ్యాపకులు పూర్తి స్థాయిలో ఉన్నారా..?

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో 92 మంది రెగ్యులర్, ఐదు మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు. ఖాళీలను గుర్తించి ఇంటర్ బోర్డుకు నివేదించాం. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఖాళీ పోస్టులకు 75 మంది అతిథి అధ్యాపకులను తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నాం.

అన్ని కళాశాలకు సొంత భవనాలు ఉన్నాయా..?

పెద్దకొత్తపల్లి, పాలెం కళాశాలలు మినహా అన్ని కళాశాలలకు సొంత భవనాలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట బాలుర కళాశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటి పరిస్థితిపై ఇంటర్ బోర్డుకు నివేదించాం.

మెరుగైన ఫలితాల కోసం ప్రణాళి రూపొందించారా..?

ఇంటర్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా గతేడాది మొదటి సంవత్సరం రాష్ట్ర స్థాయిలో 30వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 34వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి స్థానంలో నిలువడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నారా..?

జిల్లాలో అన్ని ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రైవేటు కళాశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. అధిక ఫీజులు వసూలు చేస్తే కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు అలాంటి సమస్య ఎక్కడైనా ఎదుర్కొంటే తమ దృష్టికి తీసుకురావాలి. ప్రయివేటు కళాశాలల యాజమాన్యం నిబంధనల ప్రకారం నడుచుకోవాలి.

కనుల పండువగా కోటి దీపోత్సవం

బిజినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా రవికుమార్ కార్తీక మాస విశిష్టత, దీపారాధన ప్రత్యే కతను భక్తులకు వివరించారు. దీపారాధనకు తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో సీహెచ్ రంగారావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేందర్, బాలస్వామి, గోపాలస్వామి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ లావణ్య పాల్గొన్నారు.



పాలెం వెంకన్న ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి న్యూఢిల్లీ నుంచి రాష్ట్రంలోని మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు సదస్సు లోపు రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీఎస్‌వో తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

భారత రాజ్యాంగం గొప్ప వరం

- న్యాయాధికారి గంట కవితా దేవి

గద్వాల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మనిషి ఎంచుకున్న అన్ని మత గ్రంథాల కన్నా రాజ్యాంగం గొప్పదని న్యాయాధికారి గంట కవితా దేవి అన్నారు. ప్రపంచస్థాయిలో మన రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడం ప్రతీ ఒక్కరి కర్తవ్య మని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం పట్టణ సమీపం లోని నదీ అగ్రహారం వద్ద పీజీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. రాజ్యాంగ ఫలాలను మహిళ లు సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్‌రెడ్డి, చీఫ్ లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్, డిప్యూటీ లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకులు అరవింద్, డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, డాక్టర్ గోపీనాథ్ రాథోడ్, డాక్టర్ మహేందర్, గణేష్, మహమ్మద్ రఫీ, నరేష్, నవీన్‌గౌడ్, గట్టయ్య, అంజనేయులు ఉన్నారు.

ఏడాదిలోపే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అణిచివేత రాజకీయాలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఏడాదిలోపే వ్యతిరేకత వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గువ్వల బాలరాజు మాట్లాడుతూ 14 ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ప్రజలు స్వేచ్ఛగా జీవించారని తెలిపారు. నేడు కాంగ్రెస్ పాలనలో మృతి చెందిన వారి అంతిమ సంస్కారాలు కూడా నిర్వహించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వేధింపు చర్యల వలన ఇటీవలే సీఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. కేటీఆర్ పిలుపు మేరకు కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన రోజు డిసెంబరు 29న పార్టీ జిల్లా కార్యాలయంలో ఐదువేల మంది కార్యకర్తలతో నిర్వహించ తలపెట్టిన దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దీక్ష దివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

రైతు సదస్సును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి


సిద్ధమౌతున్న వేదిక

- రేపు 5,000 మంది జిల్లా రైతులు.. 29న జిల్లాయేతరులతో..
- 30న లక్ష మందితో ముఖ్యమంత్రి సభ

మహబూబ్‌నగర్, నవంబరు 26: మహబూబ్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే రైతు సదస్సును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సదస్సులను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి తుమ్మల మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికారెడ్డి, మేఘారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈనెల 28న రైతు సదస్సు ప్రారంభం అవుతుందని చెప్పారు. మొదటిరోజు వ్యవసాయశాఖ మంత్రిగా తాను ప్రారంభం చేస్తానని, ఆ రోజు ఐదువేల మంది జిల్లా రైతులు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. రెండో రోజు జిల్లా యేతర రైతులను హాజరుపరచాలన్నారు. 30న సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఆ రోజు లక్ష మంది రైతులకు తక్కువ కాకుండా హాజరుకావాలని చెప్పారు.

మూడు రోజులు వేదికపై ఆదర్శ రైతులతో ప్రసంగాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరణలు, వ్యసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, మత్స్య రంగాలపై మాట్లాడించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికాలంలో వ్యవసాయానికి ఏ రంగానికీ ఇవ్వని ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రుణమాఫీ ద్వారా ప్రతినియోజకవర్గంలో 20 వేల నుంచి 30 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయి సదస్సుకు వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, స్టాళ్ల ఏర్పాటు కార్యక్రమాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.


ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణం

రాష్ట్ర రైతు సదస్సుకు చకచకా ఏర్పాట్లు

- స్టాళ్లను ఏర్పాటు చేస్తున్న యంత్రాంగం

రాష్ట్ర రైతు సదస్సుకు పాలమూరు ముస్తాబవుతోంది. మూడు రోజుల పాటు పండగలా నిర్వహించే ఈ సదస్సులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా నిర్వహించనుంది. భూత్పూర్ మండలం అమిస్తాపూర్ శివారులో ఈనెల 28, 29, 30 తేదీల్లో సదస్సులు జరుగనున్నాయి. సదస్సుల్లో భాగంగా 28, 29 తేదీలలో రైతు సదస్సులు నిర్వహించనుండగా, 30న జరిగే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. 28, 29 తేదీల్లో జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల రైతులు పాల్గొననున్నారు. దీంతో రెండ్రోజులుగా ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. 150 రైతు స్టాళ్లను, సీఎం పాల్గొనే వేదికను రెడీ చేస్తున్నారు. ఇప్పటికే సగం స్టాళ్లకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ స్టాళ్లలో ఆధునిక వ్యవసాయ యంత్ర సామగ్రి, వివిధ రకాల పంటలు, హైబ్రీడ్ వంగడాలు, ప్రభుత్వ పథకాలపై వ్యవసాయ, దాని అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసున్నాయి.

ఎంఎస్‌పీ కంటే తక్కువకు అమ్మొద్దు

- కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధికారి

పాలమూరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని పత్తి రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కంటే తక్కువకు అమ్మరాదని ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీప కొనుగోలు కేంద్రాలను తెలుసుకోవటానికి, సంప్రదించే వివరాలు ధర మొదలైనవి సీటటీటీ-ఎఎల్ఎల్‌పై మొబైల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకొని లేదా సీసీఐ వెబ్‌సైట్‌ను సందర్శించి తెలుసుకోవచ్చున్నారు. ఇతర సమస్యలకు సీసీఐ మెట్టుగడ్డ కార్యాలయంలో, లేదా సెల్ నెంబర్ 77189 55728వాట్సాప్ నెంబర్‌కు సందేశం పంపవచ్చని తెలిపారు.

చల్లా చెప్పినట్లే..

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో ఆరోపణలు వచ్చినప్పుడు రెండు మూడుసార్లు చెక్కులు పంపిణీ చేశారు. క్యాంపు ఆఫీసు సమీప దూరంలోని ఆయన ఇంటి వద్ద ప్రజలను కలిసే ఏర్పాట్లు ఏమైనా ఉన్నాయా? అంటే అదీ లేదు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన డాక్టర్ వీఎం అబ్రహం ఈ ఆఫీసును వినియోగించుకున్నారు. నియోజకవర్గం నలమూలల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు అక్కడ ఎమ్మెల్యేను కలిసి తమ బాధలు చెప్పుకునేవారు. ఉండేది కర్నూలులో అయినప్పటికీ.. రోజూ ఇక్కడికి వచ్చి ప్రజలను కలుస్తుండేవారు. అయన్ను కాదని, టికెట్ ఇప్పించి మరీ గెలిపించుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. ఆయన నివాసం ఉండేది పుల్లూరులోనే అయినా.. పొద్దున్నే కర్నూలుకు వెళ్లి, అక్కడి నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు మాత్రం ఎమ్మెల్యే అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

మరో అధికార కేంద్రం అవుతుందనే..

ప్రస్తుత ఎమ్మెల్యే విజయుడు అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ముందు వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. అప్పటికే బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆ ఉద్యోగానికి రాజీనామా చేయించి, అబ్రహాంను కాదని విజయుడికి టిక్కెట్ ఇప్పించారు. తర్వాత ఎన్నికల్లో గెలిపించుకున్నారు. 2004 నుంచి 2009 వరకు అలంపూర్ అసెంబ్లీ స్థానం జనరల్ కావడంతో చల్లా ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. తర్వాత ఎస్సీ రిజర్వ్ కావడంతో 2009లో డాక్టర్ వీఎం అబ్రహానికి మద్దతు తెలిపి, గెలిపించుకున్నారు. తర్వాత ఆయన తనకు, అనుచరవర్గానికి అనుకూలంగా లేరని 2014లో డాక్టర్ సంపత్ కుమార్‌కు మద్దతు ఇచ్చి, గెలిపించుకున్నారు. ఈ ఇద్దరు నాయకులు చల్లా నుంచి విడిపోయి, ప్రత్యేకంగా పాలన చేయడం, మరో అధికార కేంద్రాన్ని కొనసాగించడంతో 2018లో ఎవరికీ మద్దతు ఇవ్వలేదు. ఆ ఎన్నికల్లో డాక్టర్ వీఎం అబ్రహం గెలిచారు. 2022లో చల్లా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరగా.. ఆయనకు ఎమ్మెల్సీ పదవి లభించింది. దీంతో అలంపూర్‌లో పాగా వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయుడిని రాజకీయ తెరపైకి తెచ్చి, గెలిపించుకున్నారు. అబ్రహం, సంపత్‌కుమార్ ఈ ఇద్దరి విషయంలో జరిగినట్లు ఈసారి జరగకూడదనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రస్తుతం వినియోగించనివ్వడం లేదు. రూ.కోట్లతో నిర్మించిన కార్యాలయం సంవత్సరకాలంగా వృథగా ఉంది. గేటుకు లోపలివైపు వైర్లు చుట్టి.. తాళాలు వేసి వెళ్లారు. క్యాంపు కార్యాలయం వినియోగించకపోవడంతో ప్రజలు కర్నూలు వెళ్లి ఎమ్మెల్యేను కలవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ పాలన.. ఏపీ నుంచి అన్న చందంగా పరిస్థితి తయారైంది. ఇక్కడ వసతి లేక అక్కడ నుంచి పాలన చేస్తున్నారంటే ఏదైనా అనుకోవచ్చు. కానీ ఇక్కడ వసతి ఉన్నా.. అక్కడికి వెళ్లడమేంటని ప్రశ్నిస్తున్నారు.

అన్నీ కాంపౌండ్‌లోనే..

ఏపీలోని కర్నూలు జిల్లా కేంద్రంలో ఉన్న చల్లా కాంపౌండ్ ఇప్పుడు అలంపూర్ పరిపాలనకు కేంద్రంగా మారింది. ఆయన్ను కాదని మరో అధికార కేంద్రం ఏర్పడకుండా జాగ్రత్తలు కొనసాగుతూ ఉన్నాయి. సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, అధికారులతో సమీక్షా సమావేశాలు, ప్రజలు వస్తే కలవడం వంటివన్నీ అక్కడే జరుగుతున్నాయి. నిక్షేపంగా క్యాంపు ఆఫీసు ఉండగా, రోజూ ఉదయం ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పాలన కొనసాగించడంపై ప్రజలు విసుగు చెందుతున్నారు. అలాగే ఎమ్మెల్యేను ఎవరేమి అడిగినా.. అన్నతో మాట్లాడి చెబుతా అనే సమాధానం తప్ప అప్పుడే సమస్యకు పరిష్కారం చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం ప్రజా సమస్యలపై అధికారులను ఆయన నేరుగా అడగడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. అధికారులు కూడా ఈ పవర్ పాలిటిక్స్‌ను అర్థం చేసుకుని నేరుగా ఎమ్మెల్సీతోనే మాట్లాడుతుండటం గమనార్హం. ఏ అధికారి మాట్లాడాలనుకున్నా చల్లా కంపౌండ్‌కు వెళ్లాల్సిందే అన్నట్లు పరిస్థితి ఉంది. ఆయన అనుచరుల పేరుతో కొంతమంది అధికారులతో వీరంగం కూడా చేస్తున్నారు. ఇటీవల గ్రావెల్ ట్రాక్టర్‌ను పట్టుకున్నారని ఓ సీఐకి కాల్ చేసి చల్లా అనుచరుడొకరు తిట్ల దండకం ఎత్తుకున్నట్లు తెలుస్తోంది. మార్ట్‌గేజ్ ప్లాట్ల విషయంలో వాటిని రిలీజ్ చేయడానికి గ్రామస్థాయి అధికారిపై ఒత్తిడి చేయించారని సమాచారం. ఆర్డీఎస్ కాలువ పూడ్చితే తిరిగి తవ్వేందుకు వెళ్తున్న అధికారులకు బెదిరింపులు వస్తున్నాయని తెలుస్తోంది. ఒకసారి కంపౌండ్‌కు కూడా పిలిపించారని తెలుస్తోంది. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

దాతల రక్తంతో దోపిడీ

- ప్లేట్‌లెట్స్ పేరుతో ప్లాస్మా విక్రయం
- ఒక్కో యూనిట్‌కు రూ.15,000 వసూలు
- మోసాలకు తెరలేపిన ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు


ప్లేట్‌లెట్స్, ప్లాస్మా వేరుచేసే బ్యాగులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు దాతల నుంచి సేకరించిన రక్తాన్ని అమ్ముకుంటున్నాయి. ప్లేట్‌లెట్స్ పేరుతో ప్లాస్మాను విక్రయిస్తూ రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రోగి శరీరంలో తెల్లరక్తకణాలు తగ్గిపోతే అవి పెరగడానికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది. బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులు రెగ్యులర్‌గా రక్తదానం చేసే వారి నంబర్లకు ఫోన్ చేసి అత్యవసరంగా రక్తం కావాలని పిలిపించుకుంటున్నారు. దీంతో వారి నుంచి ప్లేట్‌లెట్స్ తీసుకొని బయటి వ్యక్తులకు వాటిని రూ. 12వేల నుంచి రూ. 15వేలకు అమ్ముకుంటున్నారు. అంతే కాకుండా రక్తాన్ని కూడా ఒక్కో యూనిట్‌కు రూ. 1400 నుంచి రూ. 1600 వరకు విక్రయిస్తున్నారు.

ప్లేట్‌లెట్ పేరుతో

మనిషి నుంచి రక్తం తీసుకునేందుకు మూడు బ్యాగులు ఉంటాయి. ఒక బ్యాగులో రక్తం తీసుకుంటారు. మరో బ్యాగులో రక్తం నుంచి ప్లాస్మాను వేరు చేస్తారు. మరో బ్యాగులో ప్లేట్‌లెట్స్ వేరు చేస్తారు. అయితే ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ ఒకేమాదిరిగా ఉంటాయి. రక్తనిధి కేంద్రాల్లో పని చేసే వారికి తప్ప వేరేవాళ్లకు ఇది తెలియడానికి అవకాశం ఉండదు. అంతేకాకుండా ఆ బ్యాగుపై రాసి ఉండేదాన్ని బట్టి అవగాహన ఉన్నవాళ్లు మాత్రమే గుర్తించే అవకాశం ఉంటుంది. దీంతో ప్రైవేటు బ్లడ్‌బ్యాంకుల యాజమాన్యాలు ప్లాస్మాను ప్లేట్‌లెట్స్‌గా విక్రయిస్తున్నారు. ప్లాస్మా ఖరీదు రూ. 600 నుంచి రూ. 800 వరకు ఉంటే.. అదే ప్లేట్‌లెట్స్ రేటు రూ.15,000 నుంచి రూ.16,000 వరకు ఉంటుంది.

ప్లాస్మా ఎక్కిస్తే ప్రయోజనం లేదు

డెంగీ వచ్చిన రోగికి సాధారణంగా ప్లేట్‌లెట్స్ తగ్గుతూ ఉంటాయి. వారం రోజుల వరకు తగ్గుతూ, ఆ వారం తర్వాత వాటంతట అవే పెరుగుతాయి. ఒకవేళ మలంలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉండడం, 10 వేల లోపు ప్లేట్‌లెట్స్ ఉంటే తప్ప వాటిని ఎక్కించే అవసరం ఉండదు. అయితే ప్లాస్మా ఎక్కించడం వలన ఎలాంటి ప్రయోజనం లేదు. ఎస్‌డీపీ దాతల ద్వారా ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తే అవి త్వరితగతిన పెరిగే అవకాశం ఉంది.

- డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, జనరల్ మెడిసిన్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ప్లేట్‌లెట్స్, ప్లాస్మా మధ్య తేడా

మనిషి శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోతే నేరుగా సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) ఎక్కిస్తారు. ఎస్‌డీపీ మిషన్ ద్వారా మనిషి రక్తంలో నుంచి నేరుగా ప్లేట్‌లెట్స్‌ను మాత్రమే తీసుకొని, మామూలు రక్తాన్ని తిరిగి అదే మనిషికి పంపిస్తుంది. ఈ ప్లేట్‌లెట్స్ రోగికి ఎక్కించడం వలన 60,000 నుంచి 80,000 వరకు ప్లేట్‌లెట్స్ పెరిగే అవకాశం ఉంటుంది. అదే ప్లాస్మాను ఎక్కిస్తే 10 వేల వరకు మాత్రమే ప్లేట్‌లెట్స్ పెరిగే అవకాశం ఉంటుంది. దీనివలన పెద్దగా ప్రయోజనం ఉండదు. కానీ బ్లడ్‌బ్యాంకుల యాజమాన్యాలు ప్లాస్మాను ప్లేట్‌లెట్స్‌గా విక్రయించి డబ్బులు దండుకుంటున్నాయి.

దాతల వివరాలు అస్తవ్యస్తం

తెల్లరక్త కణాలు దానం చేసే దాతల పూర్తి వివరాలను ఆయా బ్లడ్ బ్యాంకులు కచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఎస్‌డీపీ కిట్లు లైసెన్సు ఉన్న బ్లడ్ బ్యాంకులకు మాత్రమే ఇస్తాయి. ప్రతీ ఏడాది ఇందుకు సంబంధించిన ఆడిట్ కూడా జరుగుతుంది. దాంతో ఎస్‌డీపీ బ్యాగుల లెక్క చెప్పాల్సి ఉంటుంది. ప్రతీ ఎస్‌డీపీ బ్యాగు ఎవరికి ఇచ్చారు?, రక్తదాత పేరు, అడ్రసు, ఫోన్ నంబర్, పూర్తి వివరాలు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలి. కానీ కొందరు తప్పుడు పేర్లు, ఫోన్ నంబర్లు, అడ్రసులు నమోదు చేస్తున్నారు. మరికొందరు తల తోక లేని వివరాలు రాస్తున్నారు. రికార్డుల నిర్వహణ పూర్తి అస్తవ్యస్తంగా ఉంది.

తూకంలో మోసం

- రైసు మిల్లు ఎదుట రైతుల ఆందోళన

కోడేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకంలో మోసానికి పాల్పడ్డారని బాధితుడు రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామంలో చోటుచేసుకున్నది. కోడేరు మండలంలోని బాడుగదిన్నె గ్రామానికి చెందిన రైతు బైరపొగు బాలపీరు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాడుగదిన్నె శివారులో ఐదెకరాలలో సాగుచేసిన 213 ధాన్యం బస్తాలను మంగళవారం ఉదయం తూకం వేయించి కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామ సమీపంలో ఉన్న బాలాజీ వాసవి ఆగ్రోటెక్ రైస్ మిల్లుకు విక్రయించారు. రైసు మిల్లు వద్దకు వెళ్లిన లారీని తూకం వేయగా 62 క్వింటాళ్లు ఉన్నట్లు మిల్లు యజమాని చిట్టి ఇచ్చారు. దీంతో కంగు తిన్న రైతు బాలపీరు తాను 213 బస్తాల ధాన్యాన్ని ముందుగానే తూకం వేయగా 85 క్వింటాళ్ల 20 కిలోలు వచ్చాయని, మీరు ఎలా తూకం వేశారని నిలదీశారు. దీంతో తిరిగి రెండవ సారి తూకం వేయగా 85 క్వింటాళ్ల 20 కిలోలు వచ్చింది. దీంతో రైతులను మోసం చేస్తున్నారని గ్రామానికి చెందిన మరి కొంత మంది రైతులను సమీకరించి రైస్ మిల్లు ముందు ఆందోళన చేశారు. రైసు మిల్లు యజమానిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వెళ్లిపోయారు.

రైతులను మోసగిస్తే సహించేది లేదు

-వ్యవసాయ కమిషన్ మెంబరు కేవీఎన్ రెడ్డి


సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ కమిషన్ మెంబరు కేవీఎన్ రెడ్డి

కల్వకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాటన్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబరు కేవీఎన్.రెడ్డి హెచ్చరించారు. పత్తి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని ఆయన కోరారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గేటు సమీపంలోని వెంకటేశ్వర కాటన్ మిల్లును ఆయన ఆకసికంగా తనిఖీ చేశారు. పత్తి ధరలు ఎలా వస్తున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. సీసీఐ అధికారులతో మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో వివక్ష చూపితే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు, నాయకులు శివప్రసాద్, వేమారెడ్డి తదితరులు ఉన్నారు.

సందిగ్ధంలో ఆర్‌డీఎస్ రైతన్న

- యాసంగికి సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వని అధికారులు
- జోరుగా వరినార్లు పోస్తున్న రైతులు


యాసంగి సాగుకు సిద్దంగా ఉన్న వరినారు

అయిజటౌన్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి) : రెండు మూడేళ్లుగా వర్షాలు సక్రమంగా కురువక ఆర్‌డీఎస్ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఆర్‌డీఎస్ పరిధిలోని రైతులు పంటలు బాగానే పండించున్నారు. యాసంగి సీజన్‌కు కూడా ప్రభుత్వం ఆర్‌డీఎస్ కాలువ ద్వారా సాగునీరు అందిస్తుందనే భరోసాతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ ఈ అంశపై జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవటంతో సాగునీటి పారుదలపై రైతుల్లో సంధిగ్ధం నెలకొంది. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో 96 టీఎంసీల సాగునీరు అందుబాటులో ఉంది.

అధికారుల అస్పష్టతపై ఆందోళన

అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, రాజోలి, మానవపాడు, ఇటిక్యాల, అలంపూర్ మండలాల్లోని రైతులకు ఆర్‌డీఎస్ ద్వారా సాగునీరు అందుతోంది. అక్టోబరు, నవంబరు నెలల్లోనే అధికారులు సమావేశం ఏర్పాటు చేసి యాసంగి పంటకు సాగునీరు అందించే విషయంపై స్పష్టతనిచ్చేవారు. కానీ ఈ సంవత్సరం నవంబరు నెల ముగుస్తున్నా సాగునీటి విషయంలో స్పష్టత రాకపోవటంతో రైతులు ఏ పంటలు వేసుకోవాలో, ఎప్పటి వరకు సాగునీరు అందుతందో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు.

ఆర్‌డీఎస్ వాటా ఇలా..


తుంగభద్ర డ్యాంలో పూర్తిస్థాయి నీటిమట్టం 115 టీఎంసీలు ఉంటే ఆర్‌డీఎస్‌కు 6.5 టీఎంసీల సాగునీటి వాటా దక్కుతుంది. ఈ ఏడాది జలాశయంలో అనుకున్న మేరకు సాగునీరు అందుబాటులో ఉంది కాబట్టి ఆర్‌డీఎస్ రైతులకు కనీసం ఐదు టీఎంసీలకు తక్కువ కాకుండా వాడుకునే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. వాటాగా వచ్చే సాగునీటితో అలంపూర్ నియోజవర్గంలోని రైతులు దాదాపు 30 నుంచి 35 వేల ఎకరాల్లో రబీ పంటను సాగుచేసుకునే అవకాశం ఉంది. ఈ సమాచారంతోనే రైతులు యాసంగి సాగుకు సిద్ధపడుతున్నారు.

3న, స్పష్టత వస్తుంది : రహీముద్దీన్, ఆర్‌డీఎస్ ఎస్ఈ, గద్వాల

ఆర్‌డీఎస్ పరిధిలో యాసంగికి సాగునీరు ఎప్పటివరకు ఇచ్చే విషయంపై డిసెంబరు 3వ తేదీన స్పష్టత వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఉన్న సాగునీటిని దృష్టిలో ఉంచుకుని రబీలో ఎంతవరకు సాగునీరు అందించే విషయంపై హైదరాబాదులో ఉన్నతాధికారుల సమావేశం జరుగుతుంది. అందులో ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

గ్రామాల్లో స్వయం ఉపాధి కల్పించాలి

- పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ సృజన



మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ కమిషనర్ సృజన

ఇటిక్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో స్వయం ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సృజన తెలిపారు. మంగళవారం ఇటిక్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రజాపాలన విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలు రాజ్యాంగానికి పునాది వంటివని, దేశ అభ్యున్నతికి మూలధారమన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గ్రామసభలను నిర్వహించి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన పనులను, పథకాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం వర్మీ కంపోస్టు, అజోలా గుంటలు, పొలం బాటలు, పశువుల కొట్టాలు, ఇంకుడు గుంతల వంటి ఉపయోగకరమైన పనులను చేపడుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో వ్యవసాయానికి పెద్దపీట వేస్తామన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితిని తగ్గించి గ్రామాల్లోనే స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కాంతమ్మ, డీపీవో శ్యాంసుందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఈఈ, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

వనపర్తిలో విషాదం

వనపర్తి క్రైమ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం విషాదం చోటుచేసుకున్నది. ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య చేసుకున్నది. పట్టణంలోని గణేష్ నగర్‌కు చెందిన నిరంజన్ పాషాకు భార్య నఫీజ్ బేగం (37)తో పాటు కుమార్తె సనా బేగం(4), కుమారుడు హబీబ్ (7) ఉన్నారు. భార్య సోమవారం భర్తతో గొడవపడి కుమారుడు, కుమార్తెను తీసుకొని ఇంటి నుంచి బయటికి వెళ్లింది. వారిద్దరితో కలిసి తన ఇంటి సమీపంలోని తాళ్ల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నది. మంగళవారం మధ్యాహ్నం అటువైపు నుంచి వెళుతున్న స్థానికులు చెరువులో తేలియాడుతున్న ఒక మృతదేహాన్ని చూసి వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ హరిప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని మూడు మృతదేహాలను వెలికి తీశారు. మృతులను స్థానికులు గుర్తించి వీరి నివాసం సమీపంలోనే ఉన్నదని చెప్పడంతో పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి మృతదేహాలను చెరువులో నుంచి వెలికితీసి వనపర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోజూ కళ్ల ముందు తిరిగే చిన్నారులను మృత దేహాలుగా చూసిన గణేష్‌నగర్ కాలనీవాసులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ ని వివరణ కోరగా కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి అన్న అబీబ్‌పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని తెలిపారు.


గంగాభవానీ, పరమేశ్వరుల కల్యాణానికి హాజరైన భక్తులు

వైభవంగా గంగమ్మ పండుగ

- సందడిగా గంగాభవాని, పరమేశ్వరుల కల్యాణోత్సవం
- భక్తులను ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

రాజోలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తుంగభద్ర నది సమీపంలో కొలువుదీరిన గంగాభవాని ఆలయంలో మంగళవారం గంగాభవాని, పరమేశ్వరులకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం తుంగభద్ర నది నుంచి నీటిని తెచ్చి అభిషేకం చేశారు. మధ్యాహ్నం మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి కల్యాణం జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యాలు, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో చిన్నారుల కోలాట నృత్యాలు భక్తులకు ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

వట్టెం వెంకన్న ఆలయంలో పుష్పయాగం


వట్టెం వెంకన్న ఆలయంలో జరిగిన పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన మహిళలు తీరొక్క పూలతో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అభిషేకం చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాల నివారణ, రాజ్యం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో కార్తీక మాసంలో వేంకటేశ్వరుడికి పుష్పయాగాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో చేపట్టినట్లు అర్చకులు వివరించారు. స్వామి వారికి పుష్పయాగం నిర్వహించేందుకు అవసరమైన కైంకర్యాలను కూచకుళ్ల మనోహర్ రెడ్డి, వసుంధర దంపతులు సమకూర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్ రెడ్డి, కొర్త చంద్రారెడ్డి, గుబ్బ సత్యనారాయణ, కృష్ణారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, నరసింహాచార్యులు, విజయ్, రామకృష్ణ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్

అచ్చంపేటటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గురుకుల పాఠశాల, బాలికల కళాశాల, ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భోజనంతో పాటు శుభ్రత పాటించాలన్నారు. అపరిశుభ్రగా ఉంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం భోజనం సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సోర్ట్స్ బాక్స్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

▸ ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ అండర్-17 బాల, బాలికల జట్ల ఎంపికకు మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం మైదానంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. పోటీల్లో ప్రతిభను చాటుకొని జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, ఆనంద్, నిరంజన్‌రావు, నాగరాజు, రాఘవేందర్, సుగుణ, నాగమణి, మేరీ పుష్ప, కపిల్ పాల్గొన్నారు.

చదువుతో ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చు

▸ డీఈవో ప్రవీణ్‌కుమార్ ▸ విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీ విజేతలతో డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని జిల్లా విద్యాశాఖధికారి ఏ. ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోదా ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి ఏ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ విషయంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవడంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్విజ్ పోటీల్లో భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రథమ, పద్మాలయ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, చైతన్య స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, యశోదా ఆసుపత్రి వైద్యులు గుత్త శశిధర్‌రెడ్డి, ప్రశాంత్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కడుకుంట్ల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తేరు మైదానంలో ఈ నెల ఐదవ తేదీన నిర్వహించిన 14 సంవత్సరాల లోపు (బాల బాలికల) హాకీ ఉమ్మడి పాలమూరు జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఏడవ తరగతి విద్యార్థులు పవన్ కుమార్, డాకేశ్వరి, ఆరవ తరగతి విద్యార్థిని ఆసియా బేగం నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల ఒకటవ తేదీ వరకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారని ఫిజికల్ డైరెక్టర్ నిరంజన్ గౌడ్ తెలిపారు. ఎంపికైన కీడాకారులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి మద్దిలేటి, ఏపీసీ కమిటీ చైర్మన్ ఇందిరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



సెమీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

జడ్చర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ మైదానాలలో ఎస్జీఎఫ్ అండర్-19 పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. బాలుర విభాగంలో హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. బాలికల విభాగంలో మరో రెండు జట్లు సెమీఫైనల్స్‌కు పోటీ పడుతున్నాయి.

రగ్బీలో ధరూరు విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, పీడీ శ్రీనివాసులు

ధరూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేదీన మహబూబ్‌నగర్ నిర్వహించిన రగ్బీ అండర్ - 14 విభాగం ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థి తిరుమలేష్, ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఉరుకుందమ్మ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు రెండవ తేదీ వరకు మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాఘవేంద్ర వారిని అభినందించారు.

ఆటోవాలా.. కబడ్డీ కోచ్

అమరచింతలో ఆటో నడుపుతున్న జిలానీ



▸ ఆటపై మక్కువతో శిక్షకుడిగా మారిన ఆటో డ్రైవర్ జిలానీ

▸ ఆసక్తిగల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ▸ టోర్నమెంట్లకు తీసుకెళ్లేందుకు సొంత ఖర్చు



విద్యార్థులకు కార్నర్ చైన్‌తో రైడర్‌ను పట్టుకోవడంలో శిక్షణ ఇస్తున్న జిలానీ

అమరచింత, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా అమరచింత పట్టణానికి చెందిన జిలానీకి కబడ్డీ అంటే ఎంతో ఇష్టం. కబడ్డీ క్రీడాకారుడిగా ఉన్నత స్థాయికి ఎదగాలనుకున్నాడు. కానీ కుటుంబ ఆర్థిక నేపథ్యం, తల్లిదండ్రులు మరణించడంతో చదువు ముందుకు సాగలేదు. తనకు ఇష్టమైన కబడ్డీలోనూ ముందుకెళ్లలేక పోయాడు. పదవ తరగతి వరకే చదువుకున్న జిలానీ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కానీ తనకు కబడ్డీపై ఉన్న మక్కువను వదులుకోలేకపోయాడు. ఆటో నడుపుతూనే సీనియర్ల వద్ద ఆటలో మెళకువలను నేర్చుకొని కబడ్డీ శిక్షకుడిగా మారాడు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాడు. ప్రతీ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో నడుపుతున్నాడు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అమరచింత ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు.

రాణిస్తున్న విద్యార్థులు

జిలానీ వద్ద కబడ్డీలో మెళకువలు నేర్చుకున్న పలువురు విద్యార్థులు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు, టోర్నమెంట్లలో పాల్గొంటున్నారు. వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు, అండర్ 14 విభాగంలో మధు, అండర్ - 17 విభాగంలో జాన్ ప్రతిభ చూపారు. చేతన్ అనే విద్యార్థి అండర్ -17 లో విభాగంలో జిల్లాస్థాయిలో ఆడి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. శశాంక్, కార్తీక్, కుమార్, ఆకాష్‌లు కూడా అండర్-14 విభాగంలో ప్రతిభను కనబరిచారు. ఈ ఏడాది పెబ్బేరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలు, అండర్-14 విభాగంలో అమరచింత ప్రభుత్వ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 17 విభాగంలో కూడా నలుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికై రాణించారు. అండర్ - 17 అండర్ - 19 విభాగంలో నలుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని సాయి కబడ్డీ క్లబ్ ఎంపిక వరకు వెళ్లి వచ్చారు.

క్రీడాకారుల అభివృద్ధే ధ్యేయం

ఆటో డ్రైవర్ జిలాని తన వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారుల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారు. ఎక్కడ టోర్నమెంట్‌లు జరిగిన తన వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులను తీసుకెళ్తున్నాడు. ఇప్పటికే గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణ పేట, వనపర్తి, కర్నూల్ తదితర ప్రాంతాల్లో జరిగిన టోర్నమెంట్లకు తీసుకెళ్లాడు. అందుకోసం ఎవరైనా దాతలు ముందుకొస్తే వారి సాయం తీసుకునేవాడు. ఎవరూ ముందుకు రాకపోతే తాను సంపాదించిన సొమ్ములోనే ఖర్చు చేస్తున్నాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ శేఖర్, లెనిన్, డీజే శేఖర్, పాండు తదితరులు తనకు సహకరిస్తున్నారని జిలానీ పేర్కొన్నారు.

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ

జిలాని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో నడుపుతాడు. ఆ తర్వాత సాయంత్రం ఆరు గంటలకు అమరచింతలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకుంటాడు. అప్పటికే అతడి వద్ద శిక్షణ పొందేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉంటారు. అండర్ - 14, అండర్ - 17, అండర్ - 19 ఇలా విభాగాల వారీగా వారితో గంట పాటు శారీరక వ్యాయామం చేయిస్తాడు. అందుకోసం లారీ టైరు, రబ్బర్ తాడు, స్కూటర్ చక్రాల తో ఎక్సర్‌సైజ్ చేయిస్తాడు. ఆ తర్వాత రన్నింగ్, వా కింగ్, లాంగ్ జంప్, బాడీ వామప్, సెటిల్ రాన్, నడుము, కాళ్లకు సంబంధించిన వ్యాయామాలను చేయిస్తాడు. ఆ అనంతరం విద్యార్థులకు రెండు జట్లుగా విభజించి, డిఫెన్స్, రైడింగ్, ఆల్ రౌండర్, క్యాచింగ్, షాట్ బ్లాక్, రైడింగ్ చైన్, కార్నర్ క్యాచింగ్, బ్యాక్ హోల్డ్, జంపులు, రైడర్ కూత తదితరాల్లో విద్యార్థుల ప్రతిభను బట్టి అవసరమైన శిక్షణ ఇస్తాడు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కోచ్ జిలానీ

విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం



జీవనోపాధి కోసం ఆటో నడుపుతున్న నాకు కబడ్డీ అంటే చాలా ఇష్టం. అందుకే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. నా వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా లక్ష్యం.

\- జిలానీ, కోచ్, అమరచింత



రబ్బర్ తాడుతో సాధన చేస్తున్న విద్యార్థులు

జిల్లా జట్టుకు ఎంపికయ్యా



ప్రతీ రోజు సాయంత్రం జిలాని అన్న వద్ద కబడ్డీ నేర్చుకుంటున్నాను. ఆయన స్ఫూర్తితో పట్టుదలగా కబడ్డీ నేర్చుకొని అండర్ - 17 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యాను. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

\- చేతన్, అమరచింత

చక్కగా శిక్షణ ఇస్తున్నారు



జిలానీ అన్న ప్రతీ రోజు ఇస్తున్న శిక్షణ ఆటలో రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆయన వద్ద శిక్షణ పొందుతున్న నేను, గత వారం పెబ్బేరులో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14 విభాగంలో రాణించాను.

\- శశాంక్, అమరచింత

వివాదానికి తెర

పోలీస్ పహారా మధ్య కొనుగోలు కేంద్రం ప్రారంభం

▸ కేంద్రం ఏర్పాటు కోసం అధికార పార్టీలోని రెండు వర్గాల పట్టు ▸ ఎమ్మెల్యే వర్గానికే దక్కిన అవకాశం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

గద్వాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని బీరెల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై నెలకొన్న వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. పోలీసు పహారా మధ్య మంగళవారం కేంద్రాన్ని ప్రారంభించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. బీరెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు మొదట జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గానికి చెందిన నెహ్రూ సంఘంలోని సుజాత టీమ్‌కు అనుమతి ఇచ్చారు. దీంతో వారు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారులు వారికి తేమ, తూకం మిషన్లు, రికార్డులను కూడా అప్పగించారు. గురువారం ఉదయం వారు కేంద్రాన్ని ప్రారంభిస్తుండగా ఎమ్మెల్యే వర్గానికి చెందిన మరో మహిళా సంఘం వారు తమకే అనుమతులు వచ్చాయని, మీరు ప్రారంభించడానికి వీలు లేదంటూ అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అంతటితో ఆగకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై విచారణ నిర్వహించి, అనుమతులు ఇచ్చేవరకు కేంద్రాన్ని ఎవరూ ప్రారంభించకూడదని అధికారులు ఆదేశించడంతో పరిస్థితి చల్లబడింది. అయితే సోమవారం కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారులు నిర్ణయం తీసుకొని, పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా గ్రామ సమాఖ్య సూచించిన సంఘం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించాలని ఆదేశించడంతో సరిత వర్గం నాయకులు అడ్డుచెప్పారు. గ్రామ సమాఖ్యను భయపెట్టి, వారి అనుకూల సంఘానికి అనుమతి ఇస్తున్నారని మండిపడ్డారు. అయినా అధికారులు మాత్రం గ్రామ సమాఖ్య సూచించిన సంఘానికే అనుమతిచ్చారు. గత గురువారం జరిగిన ఘర్షణ నేపథ్యంలో సీఐ టంగుటూరు శ్రీనుతో పాటు ముగ్గురు ఎస్‌ఐలు, ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లతో పాటు ఎస్బీ, ఇంటలిజెన్స్ పోలీసులతో అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రకళ, ఏపీఎం సుజాతలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, నాయకులు రాధాకృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, నీలేశ్‌రెడ్డి పాల్గొన్నారు. అయితే సరిత వర్గం నాయకులు ప్రారంభోత్సవాన్ని వ్యతిరేకిస్తూ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు.

కుంచోనిమూల వద్ద కారు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న కారు

అచ్చంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ అచ్చంపేట మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం ఓ కారు దగ్ధం అయ్యింది. గ్రామ సమీపంలోని కుంచోని మూల వద్ద రహదారికి సమీపంలో ఈ సంఘటన జరిగింది. దీనిపై స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కారులో ఎవరూ లేరని, సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

అలంపూర్ ఆలయ ప్రధాన అర్చకుడిపై కేసు

▸ అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు

▸ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ ఆలయాల ప్రధాన అర్చకుడు, ఆలయపాలక మండలి ఎక్స్ అఫీషియో సభ్యుడు దిండిగల్ ఆనంద్‌శర్మపై కేసు నమోదయ్యింది. కర్నూలు టుటౌన్ సీఐ నాగరాజారావు, ఎమ్మెల్యే విజయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 23న ఎమ్మెల్యే విజయుడు దంపతులు కర్నూలు నగరంలోని ఓ సినిమా థియేటర్‌కు వెళ్లారు. సినిమా పూర్తయిన తర్వాత బయటకు వస్తుండగా ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి వారి ఫొటోలు, వీడియోలు తీశాడు. గమనించిన ఎమ్మెల్యే ఎవరా అని ఆరా తీస్తూనే, దగ్గరకు వెళ్లి ముసుగు తొలగించాడు. అతడు అలంపూర్ ఆలయ అర్చకుడు కావడంతో ఎందుకు ఫొటో తీస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ విషయంపై ఎమ్మెల్యే విజయుడు అదే రోజు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు టుటౌన్ పోలీసులు ఆనంద్‌శర్మను విచారించారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వంలో చలనం ఉండదా?

▸ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్ ,నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆహారం కలుషితమై విద్యార్థులు మరణిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం ఉండదా? అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఆయన స్పందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 20 రోజుల క్రితం ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థిని శైలజ మంగళవారం మృతి చెందిందని గుర్తు చేశారు. మళ్లీ బుధవారం మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆహారం కలుషితమై 30 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా విద్యాశాఖ, హోంశాఖ, మునిసిపల్ శాఖలకు మంత్రులను నియమించలేదని ఆరోపించారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

గుప్త నిధుల కోసం విగ్రహం ధ్వంసం



ధ్వంసం అయిన విగ్రహాన్ని పరిశీలిస్తున్న గ్రామస్థులు

కోడేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు పురాతన గణపతి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో సోమవారం రాత్రి ఈ సంఘటన జరగగా, మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయం సమీపంలో ఆరుబయట గణపతి విగ్రహం ఉంది. దాని కింద గుప్త నిధులు ఉన్నాయన్న ఆశతో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అలికిడి విన్న గ్రామస్థులు కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుండగులను గుర్తించి, వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గోకారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. త్వరలో నిందితులను పట్టుకొని చట్టానికి అప్పగిస్తామని చెప్పారు.

ఇంటర్వ్యూ..



పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- 'ఆంధ్రజ్యోతి'తో ఎంఈవో మురళీమోహనచారి

వంగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భావితరాలకు పదవ తరగతి తొలిమెట్టు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈవో మురళీమోహనచారి 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు వ్యక్తిత్వ విధానం, వార్షిక పరీక్షలపై గ్రేడ్ టెస్టులు నిర్వహిస్తున్నాం

విద్యార్థులకు ఏ సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు ?

గత రెండు నెలల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం, సాయంత్రం 4;15 గంటల నుండి 5;15 వరకు నిర్వహిస్తున్నాం

మండలంలో మధ్యాహ్నంభోజన అమలు ఎలా ఉంది. ?

మెను ప్రకారం సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నాం.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతకు ఏం చర్యలు చేపడుతున్నారు ?

మండలంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక తరగతులు గత రెండు నెలల నుంచి నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయలు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

మండలంలో ఉన్నత పాఠశాలలు ఎన్ని ? పదో తరగతి విద్యనభ్యసించే వారి సంఖ్య ఎంత ?

2024-2025 సంవత్సరానికి గాను మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 264 మంది.

విద్యుత్ ఏఈగా ప్రవీణ్‌కుమార్

తిమ్మాజిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండల కేంద్రంలో విద్యుత్ ఏఈ గా ప్రవీణ్‌కుమార్ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈగా పని చేసిన సాయన్నగౌడ్ బదిలీపై వెళ్లగా విద్యుత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ తిమ్మాజిపేటకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తిరిగి పరిస్థితులను తెలుసుకుంటానని, విద్యుత్ కోతలకు కారణాలను తెలుసుకుంటానని అన్నారు. అంతకు ముందు రికార్డులను పరిశీలించారు.

కేజీబీవీ తనిఖీ

అమ్రాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ తహసీల్దార్ శైలేంద్ర కుమార్‌తో కలిసి రాయల గండి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం తనిఖీ నిర్వహించినట్లు అమ్రాబాద్ ఎంపీడీవో వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇతర మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయని విషయంలో తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపాధిహామీ ఈసీ రేణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంజు ఉన్నారు

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

కొల్లాపూర్, నవంబరు 26 : కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను మంగళవారం తహసీల్దార్ మురళీధర్ రావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా విద్యార్థులతో ఆరా తీశారు. బియ్యం, ఇతర వంట సామగ్రి నాణ్యమైనవి ఉండాలని లేదా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మాలల సింహగర్జన వాల్ పోస్టర్ విడుదల

ఉప్పునుంతల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన వాల్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ ఉపాధ్యక్షులు శ్రీనయ్య పాల్గొని మాట్లాడారు. మాలల సింహగర్జన సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య, వెంకటయ్య, బలరాం, కృష్ణయ్య, సాలయ్య, రాముడు, శంకరయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌కు వినతి

కల్వకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బీసీ కమిషన్‌కు బీసీల సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందించినట్లు తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బీసీలు సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ ఆఫీస్‌లో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ 50శాతం పెంచాలని బడ్జెట్‌లో 50శాతం అలర్ట్ చేయాలని జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు కల్పించాలని కోరినట్లు తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు నరేష్, అనిల్, గణేష్, రమేష్‌గౌడ్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 26కు ఎంతో ప్రాధాన్యం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి డి.రాజేష్‌బాబు

కందనూలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర భారతదేశ చరిత్రలో నవంబరు 26 అత్యంత ప్రాధాన్యతను కలిగిన రోజు అని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, చైర్మన్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డి.రాజేష్‌బాబు అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన లా డే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, చైర్మన్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డి.రాజేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యం దేశాన్ని సార్వభౌమ సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగం ప్రకటించిందని మన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాలన్నారు. భారత రాజ్యాంగ రచనం సంఘం అధ్యక్షుడుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం రూపొందించడంలో ఎలానేని కృషి చేశారు. కార్యక్రమంలో పి.మౌనిక, ప్రిన్సిపాల్ జూని యర్ సివిల్ జడ్జి కుమారి, ఎన్.శ్రీనిధి, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ, బార్ ప్రెసిడెంట్ పర్వత్‌రెడ్డి, బార్ సెక్రటరీ న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు పత్రిక ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించడం అందరి బాధ్యత

- అదనపు కలెక్టర్

నాగర్‌కర్నూల్ టౌన్ : భారత రాజ్యాంగాన్ని గౌరవించడం అందరి బాధ్యత అని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అధికారులతో భారత రాజ్యాంగం గౌరవించడంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యాక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించి భారత రాజ్యాంగ దినం వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాల ప్రజా సంఘాల సమన్వయ జిల్లా కన్వీనర్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, డాక్టర్ శంకరయ్య, మాలమహానాడు నాయకులు జెట్టి చిన్న వెంకటేష్, చింతసత్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ నాగేష్ పాల్గొన్నారు.

●అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మిషన్ అధ్యక్షుడు టి.మద్దిలేటి, ఈశ్వర్, నరసింహ, తైలి శ్రీనివాసులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

- విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



తాడూరులో నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/ తిమ్మాజిపేట/ బిజినేపల్లి/ తాడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పర్యటించారు. పలు మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో నూతనంగా 12లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మింపతలపెట్టిన అంగన్‌వాడీ భవనానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని తిమ్మాజిపేట, ఇప్పలపల్లిలో అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంపీడీవో లక్ష్మీదేవి, పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం శ్రీహరి, అంగన్‌వాడీ సూప ర్‌వైజర్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ బహదూర్, కొండానాగేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవులు పాల్గొన్నారు.

● తాడూరు : మండల కేంద్రంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కోటీ 24 లక్షల నిధులతో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

డిసెంబరు 15 నాటికి 'మార్కండేయ' పూర్తి కావాలి

● బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి సమీపంలో చేపట్టిన మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ పనులను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. డిసెంబరు 15 నాటికి పెండింగ్ పనులను పూర్తి చేసి మార్కండేయ లిఫ్ట్ ద్వారా రైతులకు నీటిని పంపింగ్ చేయాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర కూచకుళ్ల రాజేష్ రెడ్డి ఆదేశించారు. మండలం అల్లీపూర్‌లో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణానికి, హైమాస్ట్ లైట్లను ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 30న పాలమూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించే బహిరంగ సభలో ప్రజల మదిలో ఉన్న ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుందని భరోసా కల్పించారు. ఆయన వెంట శాయిన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ అవంతి శంకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తూం హరి చరణ్ రెడ్డి, జిల్లా నాయకులు కొండ నగేష్, మిద్దె మల్లేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, తిరుపతయ్య, మిద్దె రాములు, వాల్యానాయక్, హరీశ్వర్‌రెడ్డి, ముక్తార్, రాంచందర్ నాయక్, భగవంత్ గౌడ్, దీప్లానాయక్, వీరేందర్, కదిరె రాము, నరేందర్ గౌడ్, పాషా ఉన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్ : వచ్చే నెల 1న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన మాలల సింహగర్జన సభ వాల్ పోస్టర్‌ను నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆవిష్కరించారు. మాలల సింహగర్జన సభ జిల్లా కన్వీనర్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్యతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా నాయకులు జెట్టి చిన్న వెంకటేష్, చింత సత్తి, మద్దెల చంటి, శంకరయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కందనూలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో క్రోధినామ సంవత్సవం కార్తీక మాసంచివరి సోమవారం రాత్రి కనుల పండువగా ఆది దంపతులు శివపార్వతుల కల్యాణోత్సవం వేద మంత్రోచ్చరణాల మధ్య వైభవంగా నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరద రాజన్ అయ్యంగార్ తెలిపారు. కార్యక్రమంలో ఆ లయ అర్చకులు కందాడై శ్రీనివాసాచార్యులు, కరుణశ్రీ, పద్మావతి, శ్రావణ్‌కుమార్, అర్థం రవీందర్, మల్లేష, శ్రీనివాసులు, రమాదేవి, మన్నెపురెడ్డి, శారద, నందకిశోర్, గొల్ల రాము లు, సూర్యకుమార్, శివ, స్వామి, ఏ.బాల్‌సా గర్, రామాలయ విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులు, మహిళా భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసమే మాలల ఉద్యమం

- మాదిగ జేఏసీ పార్లమెంటు నియోజకవర్గ కమిటీ కన్వీనర్ జయశంకర్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి మంత్రి పదవి కోసమే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాలల ఉద్యమాలు చేస్తున్నారని మాదిగ జేఏసీ పార్లమెంట్ కమిటీ కన్వీనర్ వంగూరి జయశంకర్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దేవకీ ఫంక్షన్ హాలులో మాదిగ జేఏసీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు జడ్జీల ధర్మాసనం తీర్పు ఇచ్చిం దని, దానిపై మాలలు వేసిన రివ్యూ పిటిషన్‌ను కూడా ధర్మాసనం కొట్టి వేసిందని పేర్కొన్నారు. మాదిగల ఓట్లతో గెలిచిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ తనకు మంత్రి పదవి రాలేదని కొంత మంది మాలలను వెనకేసుకొని మాలల ఆత్మగౌరవమని ఉద్య మాలకు తెరలేపారని విమర్శించారు. మాల మేధావులు ఆలోచించి సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు మంతటి హుస్సేన్, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు

- వీసీలో కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులందరి నుంచి సన్నరకం వడ్లను సేరించేందుకు ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ముఖ్యమంత్రికి వివరించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సన్నరకం వడ్లను సేకరించి మిల్లులకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్లు కే.సీతారామారావు, దేవసహాయం, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కొనుగోలు కేంద్రంలోని రైతులకు రసీదులు అందజేయాలని అన్నారు. రైతులకు 500రూపాయల బోనస్ వెంటనే అందేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు రుణమాఫీ ఎందుకు చేయరు

- బీజేపీని ప్రశ్నించిన రైతు సంఘాల నాయకులు

కందనూలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గౌతమ్ అదానీకి వేల కోట్ల రూపాయల బ్యాంకు అప్పులు ఇచ్చేలా చేసిన బీజేపీ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ఎందుకు చేయదని, ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య, ఏఐకేఎస్, ఏఐటీయూసీ, బీకేఎంయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా వార్ల వెంకటయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, మూడు నాలుగు సంవత్సరాల క్రితం రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తూ రైతాంగానికి ఇచ్చిన హామీలను నేటి వరకూ అమలు చేయలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కోళ్ల ఏసయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.కృష్ణాజీ, బాలమురళికృష్ణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు వి.రవీందర్, బీకేఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి దాంగట్ల వెంకటస్వామి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి జ్యూరిస్ట్ అవార్డు అందుకున్న మాజీ సర్పంచ్

అచ్చంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా టాప్ 10 మెంబర్స్‌లో లీగల్ క్యాంపులు, న్యాయ సలహాలలో ఉచిత సేవలు చేసిన ప్రజలకు అనునిత్యం సేవలు చేసినందుకు అమ్రాబాద్ మండల పరిధిలోని వటవర్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చతురునాయక్ మంగళవారం రాష్ట్ర స్థాయి జ్యూరిస్ట్ అవార్డుకు ఎన్నుకున్నారు. మంగళ వారం హైదరాబాద్‌లో బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, హైకోర్టు పూర్వం జస్టిస్ నారాయణ, చంద్రయ్య, పాండురాజ్, చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి జ్యూరిస్ట్ అవార్డు అందుకున్నారు.

29న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కల్వకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్‌లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 75 కేజీల్లోపు బరువు కలిగి ఉండి ఆధార్ కార్డు తీసుకుని రావాలని వారు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

చారకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయోధ్యనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్సనగండ్ల, రామచంద్రాపురం, అగ్రహారం తండా, గైరాన్‌తండా, శాంతిగుడెం గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ జానకిరాం నాయక్, లైన్‌మెన్ వెంకటయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామస్థులు సహకరించాలని వారు కోరారు.

కార్మికులకు సరుకుల పంపిణీ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులకు మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ తెప్ప శ్రీను, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాధ, రీజియన్ సెక్రెటరీ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా చైర్మెన్ హకీం విశ్వప్రసాద్, రాజవర్దన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- అంగన్‌వాడీ భవనాల శంకుస్థాపనలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని చారకొండ, తుర్కలపల్లి గ్రామాలలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనాల నిర్మాణానికి రూ. 24 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి గోకారం రిజర్వాయర్ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించి, సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, ఎంపీడీవో ఇసాక్ హుసేన్, ఎంపీవో వెంకటేష్, పీఆర్ డీఈఈ చంద్రకళ, పీఆర్ ఏఈఈ దివ్యరాణి, పంచాయతీ కార్యదర్శులు గణేష్, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాం గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరెటి శివ, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



చౌదర్‌పల్లిలో పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి/ వెల్దండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 20 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవననిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతీలాల్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్లు కేశమళ్ల కృష్ణ, రాజశేఖర్, నాయకులు హరికిషన్‌నాయక్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, నర్సింహ, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, అలీ ఉన్నారు.

● కల్వకుర్తి మండలం మార్చాల పంచాయతీ పరిధిలోని సత్యసాయినగర్‌లో ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ కె.సీతారామారావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువత, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి కట్టడికి కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారా మారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవాలకు అలవాటు పడిన యువత, విద్యార్థులు సర్వం కోల్పోతున్నారన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించి కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమా లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెం డెంట్ గాయత్రి, ఇంటర్ విద్యా నోడల్ అధికారి వెంకటరమణ, విద్యా, వైద్య, అటవి శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సమస్యలు పరిష్కరించాలి



కల్వకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కల్వకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతు కార్మిక, ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, ఏపీ మల్లయ్య డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలో బస్టాండ్ సమీపంలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీల పిలుపు మేరకు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులకు స్వామినాథన్ సిఫారసు మేరకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.10 వేల పించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ఆంజనేయులు, నాయకులు కిశోర్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, రాములు, జగన్, కిరణ్, పెంటయ్య, అశోక్ ఉన్నారు.

ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు



కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు

ఊర్కొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అధికారులు, నాయకులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకంలో పనులను ప్రారంభించారు. అనంతరం ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద 3 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు భూమి పూజ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కల్వకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని తహసీల్దార్ ఇబ్రహీం కోరారు. కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ గురుకులాన్ని మంగళవారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎక్కడా అసౌకర్యం కలుగకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు సక్రమంగా నీళ్లు తాగేలా చూడాలని అన్నారు. విద్యార్థినీలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు.

డీసీఎం బోల్తా పడి పలువురికి గాయాలు

తిమ్మాజిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మరికల్ శివారులో మంగళవారం రోడ్డుపై డీసీఎం బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎదిరేపల్లి తండాకు చెందిన గోగ్యానాయక్ జి.లక్ష్మీ అనే రైతులకు చెందిన పత్తిని జడ్చర్లకు చెందిన డీసీఎంలో నింపుకుని అమ్ముకోవడానికి జడ్చర్ల కాటన్ మార్కెట్‌కు వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతోని ఈ ప్రమాదం జరిగిందని డ్రైవర్‌తో సహా గాయపడిన జరిగిందని డ్రైవర్‌తో సహా గాయపడిన వారిని అంబు లెన్స్‌లో జడ్చర్ల వెళ్తా ఆసుపత్రికి చికిత్స నిమిత్తమై పంపించడం జరిగిందన్నారు.

ఆర్యవైశ్య వన మహోత్సవంలో జబర్దస్త్ టీం సందడి

- ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు



ఆర్యవైశ్య వనమహోత్సవంలో జబర్దస్త్ టీం సభ్యులు

అచ్చంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల కార్తీక వనమహోత్సవ కార్యక్రమం మంగళవారం పట్టణ సమీపంలోని పల్కపల్లి శివాలయంలో కనుల పండువగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జబర్దస్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, సత్యశ్రీ, నరేష్, శాంతి స్వరూప్ జితేంద్ర, స్రవంతిలు ఆడిపాడి సందడి చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆకుతోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు ఉసిరివృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలను ఆరగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు రామకృష్ణ, శ్యాంసుందర్, చంద్రకుమార్ పాల్గొన్నారు.